# అంతర్జాతీయ యోగా సదస్సుకు గుంజీళ్ళ మాస్టారు అందె జీవన్ రావు

నిజామాబాద్ ప్రతినిధి, బతుకమ్మ ఈ నెల 27 నుండి మార్చి 1 వ వరకు తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి లోని వివేకానంద కేంద్రం లో పతంజలి యోగా సూత్ర అంశంపై నిర్వహింపబడే యోగా శాస్త్ర సంగమం 2026 - 9 వ అంతర్జాతీయ యోగా ఫిలాసఫీ సదస్సుకు నిజామాబాద్ జిల్లా నుండి గుంజీళ్ళ మాస్టారుగా పేరొందిన అందె జీవన్ రావు పాల్గొననున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో "సూపర్ బ్రెయిన్ యోగా, పతంజలి యోగా సూత్రాల మధ్య సారూప్యం" అనే అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బోధన్ పతంజలి యోగా సమితి అధ్యక్షులు డాక్టర్ పుండరీక్ గౌడ్ మాట్లాడుతూ భారత దేశంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వివిధ రాష్ట్రాలలోనే కాకుండా బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ తదితర దేశాలలో సూపర్ బ్రెయిన్ యోగా అంశంపై వివిధ సదస్సులలో పరిశోధనా పత్రాలు, కార్యశాలలను ఆయన నిర్వహించడం అభినందనీయమన్నారు. పతంజలి యోగా సమితి ప్రధాన కార్యదర్శి అబ్బయ్య మాట్లాడుతూ సూపర్ బ్రెయిన్ యోగా అన్ని వయసుల వారికి ఉపయుక్తమైందని, ముఖ్యంగా విద్యార్థులు ప్రతి నిత్యం దీనిని సాధన చేయడం ద్వారా తెలివితేటలు,ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పతంజలి యోగా సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పుండరీక్ గౌడ్, అబ్బయ్య మరియు సభ్యులు అందె జీవన్ రావును శాలువాతో ఘనంగా సన్మానించినారు.




## ఛత్రపతి శివాజీ రూపొందించిన బాటలో

# మతసామరస్యాన్ని కాపాడుకుందాం

### సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

### సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా బహుజనుల రాజు చత్రపతి శివాజీ జయంతి

కామారెడ్డి, బతుకమ్మ :శివాజీ పోరాటం రాజ్య స్థాపన లక్ష్యమే కానీ మత రాజ్యాన్ని స్థాపించడం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించడానికి శివాజీ వీరోచిత పోరాటం చేశాడని అన్నారు. ఆ పోరాటంలో శివాజీ కూడా కుల వివక్షకు గురయ్యాడని, ఆయన పట్టాభిషేకానికి పీష్వా బ్రాహ్మణులు ముందుకు రాకపోవడంతో కలకత్తా నుండి గంగాభట్ అనే బ్రాహ్మణుని పిలిపించి శివాజీ ఉన్న బరువు గల బంగారం ఇస్తేనే పట్టాభిషేకం చేస్తామని అనడంతో బంగారం ఇచ్చిన కూడా కాలి బొటన వేలుతో తిలకం దిద్ది పట్టాభిషేకం చేశారని గుర్తు చేశారు. అంతటి శివాజీ మహారాజ్ నే వివక్షకు గురిచేసిన చరిత్ర పీష్వా బ్రాహ్మణులదని అన్నారు. శివాజీ చేసిన పోరాటం అణచివేయబడ్డ ప్రజల కోసం, మరాఠా సామ్రాజ్య కోసం చేశారని కేవలం ఒక మతం కోసం కాదని అన్నారు. ఆయన సైన్యంలో సర్వ సైన్యాధ్యక్షులుగా ముస్లింలను నియమించారని అది అందరూ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. బహుజనుల ఆరాధ్య స్ఫూర్తి చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటట్ గౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ముదం అరుణ్, భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు విట్టల్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, నితిన్, సాయి, నవీన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



# బాన్సువాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన పోచారం

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా బుడిమి గ్రామంలో గురు మదనానంద సరస్వతి పీఠదీశ్వరులు మాధవనంద సరస్వతి స్వామి వారి సమక్షంలో హరి హర దేవి దేవతల ప్రతిష్ఠాపన మహోత్సవ సందర్భంగా శుక్రవారం జలాధివాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మోస్రా మండల పరిధిలోని గోవూరు గ్రామం ప్రధాన రహదారిపై ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, గోవూర్ గ్రామంలో ఎస్ డీ ఎఫ్ నిధులు 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ ను తన చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే వర్ని మండల పరిధిలోని తగిలేపల్లి గ్రామంలో హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి వారి సమక్షంలో హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఎస్ డీ ఎఫ్ నిధులు 10 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆశ్రమ భవనమును ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో బాన్సువాడ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# బాధితునికి ఎల్ఓసీ అందజేత

బాల్కొండ, బతుకమ్మ :మండలంలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు మాగాని రాములు కు రూ. 2.50 లక్షల ఎల్ ఓ సీ ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం అందజేశారు. తన నివాసం వేల్పూర్ ఎల్ ఓ సీ అందజేసిన ఎమ్మెల్యే కు భాధితుని కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు



# ఫ్యూజన్ ఫార్మా కంపెనీ విస్తరణకు వ్యతిరేకంగా తీర్మానం



భిక్కనూరు, బతుకమ్మ :భిక్కనూరు మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో గ్రామ సభలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూజన్ ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా గురువారం తీర్మానం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు వ్యతిరేకించిన కారణంగా ఈరోజు గ్రామసభలో వ్యతిరేక తీర్మానం చేశామని సర్పంచ్ జనగామ రాణి అన్నారు. ఇప్పటికే ఎం ఎస్ ఎన్ కంపెనీ వల్ల గాలి నీరు కలుషితం అవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సాయంత్రం 6 గంటల నుంచి వాసన వెదజల్లడంతో శ్వాస కూడా ఆడడం లేదని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూజన్ ఫార్మా కంపెనీకి అనుమతించవద్దని, ఈ ఫార్మా కంపెనీ వల్ల వాయు కాలుష్యం కారణంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యం బారిన పడతారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫార్మ కంపెనీకి భిక్కనూరు మండలంలో అనుమతి ఇవ్వవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు ఉన్నారు.

# మండల లెవల్ ఫిజిక్స్ కంపిటేషన్‌లో జడ్పిహెచ్ఎస్ రామన్నపేట్ ఫస్ట్



వేల్పూర్, బతుకమ్మ :వేల్పూర్ మండలంలోని ప్రభుత్వ స్కూల్ స్టూడెంట్ల కోసం నిర్వహించిన మండల్ లెవల్ ఫిజిక్స్ కంపిటేషన్ లో జిల్లా పరిషత్ హై స్కూల్ రామన్నపేట్ స్టూడెంట్స్ విజయందుందుభి మ్రోగించారు. ఈ కంపిటేషన్ లో జడ్పిహెచ్ఎస్ రామన్నపేట్ స్కూల్ కు చెందిన బి. సమ్యజ్ఞ విన్నర్ గా నిలువగా, జి. నిహారిక రన్నర్ గా నిలిచింది.ఈ సందర్భంగా స్టూడెంట్లకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ టీచర్ మనోహర్ సార్ ను అభినందించారు.

# సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ తోడ్పాటు



భిక్కనూరు, బతుకమ్మ :పేదలకు సొంతింటి కల నేరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరుగుతుందని ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు చీట్టడి సుధాకర్ రెడ్డి, సర్పంచ్ వలకొండ మంజుల సంజీవరెడ్డి అన్నారు. గురువారం భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామంలో మైలారం భూదవ్వ బలరాం అనే లబ్ధిదారుని ఇంటిని వారు ప్రారంభించి మాట్లాడారు. ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇంటిని నాణ్యతతో నిర్మించుకొని ప్రభుత్వం అందించే ఐదు లక్షల సాయాన్ని అందుకోవాలని వారు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు సర్పంచ్ సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో పున్న గంగయ్య, గోపాలస్వామి, అఖిల్, భాను, అరవింద్, అమృత రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.